
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 21 జనవరి 2024





విక్టరీ సింబల్ చూపుతున్న చంద్రబాబు నాయుడు

దుర్మార్గంగా జగన్ పాలన



డుంబ్రిగుడ మండలం అరకులో రా.. కదలిరా సభకు హాజరైన అశేష జనం

సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

మరికొన్ని ఫొటోలు 7వ పేజీలో..

నాలుగున్నరేళ్లలో అనేక రెట్లు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు

- విద్యుత్ చార్జీలు ఐదు రెట్లు పెంపు
- నాసిరకం మద్యం అమ్మకాలతో 35 లక్షల మంది అనారోగ్యంపాలు
- అరకు సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు ధ్వజం
- టీడీపీ ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే... వైసీపీ గంజాయిని ప్రమోట్ చేసిందని విమర్శ
- మన్యంలో లేటరైట్ పేరిట బాక్సైట్ దోపిడీ
- కులం, మతం పేరుతో జగన్ చేస్తున్న మోసాలకు ఎవరూ బలికావద్దు
- రుషికొండకు బోడిగుండు కొట్టించారు... మరోసారి వస్తే అరకు కొండలకు గుండుగీత
- గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక, నిధుల కేటాయింపు

డుంబ్రిగుడ/పాడేరు/అరకులోయ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):

ప్రజలకు మంచి పాలన ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి దుర్మార్గుడిలా ప్రవర్తిస్తున్నారని తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మండిపడ్డారు. 'రా...కదలిరా' పేరుతో శనివారం మధ్యాహ్నం అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం అరకులో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. నిత్యం బటన్ నొక్కుతానని సీఎం చెబుతుంటారని, దానివల్ల ప్రజలకు ఇచ్చేది పిసరంత...ఆయనకు మాత్రం లాభం కొండంత అని విమర్శించారు. ఐదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు అనేక రేట్లు పెరిగిపోయాయన్నారు. కిలో బియ్యం రూ.40 నుంచి రూ.60కు, కందిపప్పు రూ.80 నుంచి రూ.160కు, చింతపండు రూ.122 నుంచి రూ.240కు పెరిగాయన్నారు. విద్యుత్ చార్జీలు ఐదు రెట్లు పెంచేశారని అన్నారు. తాము ఇంటింటికీ కేబుల్ టీవీ ప్రసారాలను రూ.149కి అందిస్తే ఇప్పుడు రూ.350కు పెంచారని ఆరోపించారు. చివరకు నాసిరకం మద్యం అమ్మకాల వల్ల 35 లక్షల మంది అనారోగ్యానికి ... మిగతా 8వ పేజీలో

చంద్రబాబుకు బ్రహ్మరథం

అరకులో 'రా...కదలిరా' సభకు అశేషంగా తరలివచ్చిన జనం

- ఉత్సాహంగా ప్రసంగించిన టీడీపీ అధినేత
- ఇంత ఆదరణ చూపుతున్న గిరిజనులను తన జన్మలో మరిచిపోలేనని వెల్లడి

అరకులోయ/డుంబ్రిగుడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):
మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు గిరిజనులు బ్రహ్మరథం పట్టారు. 'రా...కదలిరా' పేరుతో జిల్లాలోని డుంబ్రిగుడ మండలం అరకులో పార్టీ నిర్వహించిన సభకు పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. అరకులో ఇంత ఆదరణ చూపుతున్న గిరిజనులను తన జన్మలో మరిచిపోలేనంటూ చంద్రబాబునాయుడు వారికి కృతజ్ఞతలు తెలిపారు. సభకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది హాజరుకావడంతో చంద్రబాబు సైతం ఎంతో ఉత్సాహంగా గంట సేపు ప్రసంగించారు. గిరిజనుల సమస్యలు, వారి జీవనోపాధి, అక్రమ మైనింగ్, పథకాలు రద్దు, తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు. ఆయన ప్రసంగానికి గిరిజనులు పలుమార్లు స్పందిస్తూ హర్షధ్వానాలు చేశారు. సభ నిర్వహించిన 15 ఎకరాల ప్రదేశం జనంతో నిండిపోగా, చుట్టుపక్కల ఖాళీ ప్రదేశాలు, గుట్టలపై వేలాది మంది గిరిజనులు కూర్చొని బాబు ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. దీంతో చంద్రబాబునాయుడు అందరివైపు చూస్తూ విక్టరీ చిహ్నంతో అభివాదం చేయడంతో గిరిజనుల్లో మరింత ఉత్సాహం కనిపించింది. పాడేరు, అరకులోయ ... మిగతా 8వ పేజీలో

అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొర

- ప్రకటించిన చంద్రబాబునాయుడు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో బాబు స్వయంగా ప్రకటించిన తొలి సీటు ఇదే



అరకులోయ/డుంబ్రిగుడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):
అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎవరనే దానిపై పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు స్పష్టత ఇచ్చారు. రా...కదలిరా సభలో అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొరేనని, ఆయనను అందరూ గెలిపించాలని సూచించారు. ఎటువంటి ఆపోహలకు తావులేకుండా పార్టీ నేతలంతా సమష్టిగా ... మిగతా 8వ పేజీలో

వైభవంగా వేల్పులవీధి గౌరమ్మ ఉత్సవం



రథంపై ఉన్న గౌరీపరమేశ్వరులు

- ఆకట్టుకున్న నేలవేషాలు, సాంస్కృతిక ప్రదర్శనలు
- భారీగా తరలి వచ్చిన జనం

అనకాపల్లి టౌన్, జనవరి 20: వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం తెల్లవారుజామున వైభవంగా ప్రారంభమైంది. గౌరీ పరమేశ్వరులకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాజకీయ ప్రముఖులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, పరుచూరి భాస్కరరావు, డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. తెల్లవారుజామునే ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం విజయనగరం, కాకినాడ, విజయవాడ, సబ్బవరం ప్రాంతాలకు చెందిన కళాకారుల నేలవేషాలు ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి శారదానది వరకు ఉత్సవాన్ని తిలకించడానికి వచ్చిన జనంతో రహదారులు కిటకిటలాడాయి. అర్ధరాత్రి సమయంలో భారీ ఎత్తున బాణసంచా వెలిగించారు. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉత్సవానికి తరలి వచ్చిన జనం

కొత్త పింఛన్లు కొందరికేనా?

జిల్లా వ్యాప్తంగా 13 వేల కొత్త దరఖాస్తులు

- 5,840 మంది అర్హులుగా తొలుత గుర్తించిన అధికారులు
- కేవలం 2,949 మందికి మాత్రమే నగదు పంపిణీ
- పింఛన్ ఇవ్వలేదని 2,891 మంది గగ్గోలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే తొలుత అర్హులుగా ప్రకటించి ఆ తరువాత కొంత మందికి ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని పలువురు ఆరోపిస్తున్నారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 13 వేల దరఖాస్తులు రాగా, క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి 5,840 మంది అర్హులని అధికారులు ప్రకటించారు. అయితే వీరిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు 2,949 మందికి మాత్రమే పింఛన్ల నగదు అందించారు. మిగతా 2,891 మందికి పింఛన్ ఇవ్వకుండా సాకులు చెబుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 13 వేల మందికి పైగా కొత్తగా వైఎస్సార్ భరోసా పింఛన్ కోసం గ్రామ సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన తరువాత సుమారు 5,840 మందికి తొలుత పింఛన్ పొందేందుకు అర్హులుగా ప్రకటించారు. మిగిలిన వారి దరఖాస్తులను తిరస్కరించారు. 2024 జనవరి ఒకటో తేదీ నుంచి రూ.3 వేలు పింఛన్ ఇవ్వాల్సిన జాబితాలో జిల్లాలో కేవలం 2,949 మందికి మాత్రమే కొత్తగా పింఛన్లు అందించారు. మిగతా 2,891 మందికి ఇంకా పింఛన్ల నగదు ఇవ్వకుండా ఏవో సాకులు చెబుతున్నారన్న విమర్శలున్నాయి. తమను తొలుత అర్హులుగా గుర్తించి ఇప్పుడు పింఛన్ ఇవ్వకపోవడమేమిటని అర్జీదారులు మండిపడుతున్నారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేయకపోవడంపై డీఆర్‌డీఏ పీడీ శచీదేవిని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అర్హులను గుర్తించి కొత్త పింఛన్లు మంజూరు చేశామన్నారు. అర్హత ఉన్నా పింఛన్ అందలేదని భావిస్తున్నవారు గ్రామ సచివాలయాల్లో మరోసారి అర్జీ పెట్టుకొని తమకున్న అర్హత పత్రాలను అందజేయాలని సూచించారు.

పడకేసిన పనులు

	సచివాలయాలు	ఆర్‌బీకేలు	విలేజ్ క్లినిక్‌లు
	(మంజూరు- పూర్తి అయినవి)		
గొలుగొండ	20 - 17	17 - 10	10 - 4
మాకవరపాలెం	15 - 12	14 - 7	11 - 6
నర్సీపట్నం	9 - 7	7 - 6	6 - 3
నాతవరం	16 -11	14 - 6	12 - 5

నియోజకవర్గానికి 61 సచివాలయాలు, 59 ఆర్‌బీకేలు, 49 హెల్త్ క్లినిక్‌లు మంజూరు

- మూడున్నర సంవత్సరాలు దాటుతున్నా పూర్తి స్థాయిలో కాని పనులు
- కాంట్రాక్టర్లకు సకాలంలో అందని బిల్లులు
- ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకూ గ్రహణం

నర్సీపట్నం, జనవరి 20:
ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను శరవేగంగా పూర్తి చేస్తామని, వాటికి నిధుల కొరత లేదని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. నియోజకవర్గంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడమే దీనికి ఉదాహరణ. కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల రాకపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నట్టు సమాచారం.



నర్సీపట్నం మండలం అమలాపురంలో పునాదుల స్థాయిలో నిలిచిపోయిన విలేజ్ క్లినిక్

వైసీపీ ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం నియోజకవర్గంలోని నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాలకు 52 రైతు భరోసా కేంద్రాలు, 61 సచివాలయాలు, 49 విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సచివాలయాల కొత్త భవనాలకు రూ.40 లక్షలు, పంచాయతీ కార్యాలయాల మీద నిర్మాణం చేసే భవనాలకు రూ.25 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. హెల్త్ క్లినిక్‌లకు రూ.17.5 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.21.8 లక్షలు మంజూరు చేసింది గ్రామాల్లో ఎంతో అట్టహాసంగా నిర్మాణాలు ప్రారంభించారు. ప్రతీ గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాలకు పక్కా భవనాలు అందుబాటులోకి వస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే నర్సీపట్నం నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రూ.4 కోట్లు వరకు బిల్లులు బకాయిలు పేరుకుపోయాయి. రెండు నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు మందకొడిగా ... మిగతా 8వ పేజీలో

పనులు ఎక్కడా ఆగలేదు



పనులు వేగంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ భవనాల నిర్మాణాల పనులు ఎక్కడా ఆగలేదు. పునాదుల స్థాయిలో ఉన్న కొన్ని భవనాలు ఆపి చివరి దశలో ఉన్న వాటిని పూర్తి చేస్తున్నాం. తరువాత పునాదుల స్థాయిలో ఉన్న భవనాలు పూర్తి చేస్తాం.
- ఇ.ఈశ్వరరావు, డీఈఈ, పంచాయతీ రాజ్, నర్సీపట్నం




ఎన్టీఆర్, ఏఎన్ఆర్, హరివంశరాయ్ బచ్చన్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్ సినీ పరిశ్రమకు రెండు కళ్లు

- సినీ నటుడు చిరంజీవి

తెలుగు సినిమా రంగానికి ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్ రెండు కళ్లు లాంటి వారని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి అన్నారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ 28వ పుణ్యతిథి, ఏఎన్ఆర్ శత జయంతి కార్యక్రమం శనివారం రుషికొండ ఏ1 గ్రాండ్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. - వార్త చిత్రజ్యోతిలో..


చిరునవ్వులు చిందిస్తూ సభా వేదికపై చంద్రబాబునాయుడు అభివాదం


డుంబ్రిగుడ మండలం అరకులో టీడీపీ నిర్వహించిన రా... కదలిరా బహిరంగ సభకు హాజరైన జనసందోహం


చంద్రబాబుకు బొకే అందిస్తున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్


బాబు ప్రసంగానికి కేరింతలు కొడుతున్న గిరిజన మహిళలు

కదలివచ్చిన 'గిరి'జనం

అందాల అరకు పసుపుమయమైంది. కొండ కోనల్లోని అడవిపుత్రుల్లో సైతం ఆనందం వెల్లివిరిసింది. తమ భవితకు భరోసా కల్పించే గొంతు నుంచి వచ్చే మాటలు వినేందుకు ఇంటిల్లిపాదీ కదలి వచ్చింది. ఫలితంగా ఆ ప్రాంతం జనసందోహమైంది. 'రా.. కదలిరా' పేరిట టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన భారీ బహిరంగ సభకు శనివారం విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి రోడ్లన్నీ అరకు వైపే అన్నట్టుగా అశేష జనం వడివడిగా అడుగులు వేసుకుంటూ విచ్చేశారు. ఇక తెలుగుతమ్ముళ్లలో ఉత్సాహం ఉరకలేసింది. పార్టీ జెండాలు చేతబట్టి.. జేజేలు కొడుతూ తమ ప్రియతమ నేతకు ఘనస్వాగతం పలికారు. ఇక్కడి కోలాహల వాతావరణం చూసిన చంద్రబాబు సైతం రెట్టించిన ఉత్సాహంతో ప్రసంగం చేసి ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఈ సభ విజయవంతం కావడంతో అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని తెలుగుదేశం పార్టీ కేడర్‌లో కొంగొత్త ఉత్సాహం కనిపిస్తోంది. - పాడేరు


సభా వేదికపై ఆసీనులైన పాడేరు, అనకాపల్లి జిల్లాల్లోని టీడీపీ నాయకులు


బాబుకు బొకే అందించి స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు అబ్రహం


చంద్రబాబు సభకు తరలి వస్తున్న ప్రజానీకం


అరకులోయ అసెంబ్లీ అభ్యర్థిగా దొన్నుదొరను ప్రకటిస్తున్న చంద్రబాబు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చంద్రబాబు


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం


సభకు హాజరైన టీడీపీ మహిళా నేతలు

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో క్లీనర్ మృతి

పరవాడ, జనవరి 20: అనుమానాస్పద స్థితిలో ట్రాలీ లారీ క్లీనర్ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గుడివాడ మండలం మోపూరుకు చెందిన పిళ్లా నాగేశ్వరరావు (65) కొన్నేళ్లుగా లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 18న మునగపాక మండలం వెంకటాపురం క్లాసిల్ పరిశ్రమ నుంచి ఇక్కడి ఇండస్ట్రియల్ పార్కులో గల టీకే స్టీల్ పరిశ్రమకు ఐరన్ లోడు కోసం వెళ్లాడు. ఆదే రోజు రాత్రి డ్రైవర్, క్లీనర్ నాగేశ్వరరావు కలిసి భోజనం చేశారు. రాత్రి పది గంటల సమయంలో నాగేశ్వరరావు మంచినీటి కోసం పరిశ్రమ గేటు వద్దకు వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే కంపెనీకి చెందిన కార్మికులు అతన్ని అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శనివారం కుటుంబసభ్యులకు అప్పగించారు. సీఐ బాల సూర్యారావు పర్యవేక్షణలో ఎస్‌ఐ తేజేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

- స్వల్ప గాయాలతో బయటపడిన భార్య, పిల్లలు
- వేపాడ మండలం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఘటన

దేవరాపల్లి, జనవరి 20: మండలంలోని కాశీపురం సచివాలయం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలకు గురై కేజీహెచ్‌లో చావుబ్రతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్నాడు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడుకు చెందిన భూమిరెడ్డి శంకరరావు శుక్రవారం దేవరాపల్లి మండలం కలిగొట్లలో జరిగిన తీర్థానికి తన చెల్లెలు ఇంటికి భార్య, పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. రాత్రి కాశీపురం సచివాలయం సమీపానికి చేరగా మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. దీంతో హెల్మెట్ ధరించి ఉన్నప్పటికీ శంకరరావు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా, అతని భార్యా పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు.

కుక్కల దాడిలో పదకొండు గొర్రెలు మృతి

మాకవరపాలెం, జనవరి 20 : మండలంలోని రామరాయుడుపాలెంలో శనివారం రాత్రి వీధికుక్కల దాడిలో పదకొండు గొర్రెలు మృతిచెందాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. బూరుగుపాలెం పంచాయతీ శివారున గల ఈ గ్రామంలో పోతల తాతయ్యలు తన గొర్రెలను ఉదయం మేతకు తీసుకు వెళ్లాడు. సాయంత్రం మేత అనంతరం ఇంటికి కొంత దూరంలో ఉన్న పశువుల పాక వద్ద వాటిని కట్టి వెళ్లిపోయాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో తిరిగి పశువుల పాకవద్దకు వచ్చి చూడగా, కుక్కల గుంపు కనిపించింది. భయంతో చుట్టుపక్కల వారిని పిలిచి వారితో కలిసి వెళ్లి చూడగా పదకొండు గొర్రెలు చనిపోయి కనిపించాయి. దీంతో భోరున విలపించాడు.


కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

రహదారి ప్రమాద ప్రాణదాతకు రూ. ఐదువేలు

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 20: రహదారి ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్ సమయంలో ఆస్పత్రి లేదా ట్రామాకేర్ సెంటర్‌కు తరలించి తగిన చికిత్సను అందించిన ప్రాణదాతలకు ప్రభుత్వం రూ. ఐదు వేలు నగదు, ప్రశంసాపత్రం ఇస్తుందని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి తెలిపారు. శనివారం శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన రవాణా శాఖ ముద్రించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పక పాటించాలన్నారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగినట్టయితే తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.దయానిధి, జిల్లా రవాణా అధికారి కేవీ ప్రకాశరావు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

సీఎంతో సహా వైసీపీ నేతలకు ఓటమి భయం

- టీడీపీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజదీశ్


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధ నాగజగదీశ్వరరావు, తదితరులు

అనకాపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సభలకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనను చూసి సీఎం జగన్‌రెడ్డితో సహా వైసీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు విమర్శించారు. శనివారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి అన్ని వర్గాల ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నాయకులకు నవరత్రాలపై నమ్మకం లేక దొంగ ఓట్లపైనే ఆధారపడ్డారని ఎద్దేవా చేశారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో కూడా దొంగ ఓట్లు నమోదు చేశారని, దీనిపై గతంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఈనెల 22న తుది జాబితా ప్రకటించే ముందు తమ ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా తుది జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగన్‌రెడ్డి సాగునీరు ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని, కనీసం గ్రోయిన్ల మరమ్మతులు, పంట కాలువల జంగిల్ క్లియరెన్స్ చేయలేదన్నారు.అంగన్‌వాడీలు తమ సమస్యలపై ఆందోళన చేస్తుంటే జిల్లా మంత్రులు గుడివాడ అమర్‌నాద్, బూడి ముత్యాలనాయుడు కనీసం వారి గోడు వినలేదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేకేవీపీ నారాయణ రావు, షేక్ బాబర్, బొడ్డేడ మురళి, కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

సినీ రచయిత జేకే.భారవికి 'వేటూరి' పురస్కారం


జేకే.భారవి

పాయకరావుపేట, జనవరి 20: స్థానిక వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఏటా ఇస్తున్న 'వేటూరి' కవితా పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు జేకే.భారవికి అందజేయనున్నట్టు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వరశర్మ తెలిపారు. శనివారం ఇక్కడ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా జనవరి 29వ తేదీన 'వేటూరి' జన్మదినం పురస్కరించుకుని సినీ, సాహితీరంగ ప్రముఖులకు 'వేటూరి' సాహితీ పురస్కారం ఇచ్చి సత్కరిస్తున్నామన్నారు. ఈఏడాది వేటూరి కవితా పురస్కారాన్ని జేకే.భారవిని ఎంపిక చేశామన్నారు. శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 29న తునిలో నిర్వహించనున్న పురస్కార కార్యక్రమానికి సాహితీ ప్రియులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

'డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్‌లో ఉద్యోగాలకు ఆహ్వానం'

అనకాపల్లి టౌన్, జనవరి 20: డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న మూడు పోస్టులకు ఒక ఏడాది తాత్కాలిక ప్రతిపాదనపై జరిపే నియామకాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యాధికారి, కౌన్సిలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అర్హత గల వారు అన్ని సర్టిఫికెట్లను జరపరచి దరఖాస్తులను తన కార్యాలయానికి ఈనెల 30వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు అందజేయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు అనకాపల్లి.ఏపీ. జీవోవి.ఇన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఏయూ వీసీగా ప్రసాదరెడ్డి బాధ్యతలు స్వీకారం

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా రెండో పర్యాయం నియమితులైన ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో ఏయూను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. దానికి ఇటీవల నాక్ ఏ++ ర్యాంకు సాధించడమే నిదర్శనమన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఏయూ అభివృద్ధి సాధించిందన్నారు. 2025-26లో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు ప్రధాని, రాష్ట్రపతిని ఆహ్వానిస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరెడ్డికి ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ కె.సమత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ఏయూ పూర్వ వీసీ ప్రొఫెసర్లు బీల సత్యనారాయణ, ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, పూర్వ రిజిస్ట్రార్ జి.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్స్, డీన్లు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించేందుకు వస్తున్న వీసీకి స్వాగతం పలుకుతూ కొంత మంది విద్యార్థులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. కొన్ని నిమిషాలపాటు బాణాసంచా శబ్దాలతో వర్సిటీ మార్మోగింది. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్‌రెడ్డి

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి


భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, జనవరి 20: మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు తెల్లవారుజామున పంచామృతాభిషేకం చేశారు. అనంతరం కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు పూజలు, నిత్య హోమాలు చేశారు. కింద ఆలయంలో క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. అనేక మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కొండకర్ల ఆవలో సినీ నటి మంజుల షికారు

అచ్యుతాపురం, జనవరి 20: హీరో మహేష్‌బాబు సోదరి, సినీనటి మంజుల కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కొండకర్ల ఆవను సందర్శించారు. ఫైబర్ బోటులో వీరంతా కొండకర్ల ఆవలో షికారు చేశారు. బోటులో కుటుంబ సభ్యులతో స్వీయ ఫొటోలు తీయడంతో పాటు ఆవలో తేలియాడే తామర పువ్వులు, తామర ఆకుల నడుమ బోటు ఆపి ఫొటోలు తీసుకున్నారు. ఆవ అందాలు అద్భుతంగా ఉన్నాయని, ఇంతకాలం తమకు తెలియక ఇక్కడకు రాలేకపోయానని ఆమె అన్నారని బోటు నిర్వాహకులు తెలిపారు. కొందరు ఆమెను గుర్తించి ఫొటోలు తీయడానికి ప్రయత్నించినా ఆమె వారించడంతో తియ్యలేదన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ సందడి





అనకాపల్లిలో వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. పలువురు ప్రముఖులు దర్శించుకొన్నారు. అమ్మవారి ఊరేగింపులో వివిధ నేలవేషాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. రాత్రికి జరిగిన జాతరకు వేలాది మంది తరలివచ్చారు. జాతరలో వేసిన దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. -అనకాపల్లి టౌన్

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

అనకాపల్లి టౌన్, జనవరి 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని నిరసిస్తూ కోర్టు వద్ద అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల రిలే నిరాహారదీక్షలు శనివారం కూడా కొనసాగాయి. దీక్షలో సీనియర్ న్యాయవాదులు సుంకర శ్రీనివాసరావు, గేదెల నాగేశ్వరరావు, ఆర్డీ ప్రసాద్ కూర్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజల హక్కులు, ఆస్తుల రక్షణకు భంగం కలిగించే ఈ చీకటి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

30న నాయీ బ్రాహ్మణ సంఘం వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్, జనవరి 20 : ఈనెల 30వ తేదీన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం 23వ వార్షికోత్సవ కరపత్రాలను సంఘం గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొణతాల జగన్నాథరావునాయుడు (జగన్) శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ సామాజికవర్గం ఐక్యతగా ఉండి సంఘాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మెలిపాక ఈశ్వరరావు, కందికొండ గంగరాజు, ఉపాధ్యక్షుడు ద్రాక్షారపు సోములు, కోశాధికారి కొడమంచిలి నూకరాజు పాల్గొన్నారు.

భీమిలి వైసీపీ సమావేశాన్ని జయప్రదం చేయండి

అనకాపల్లి టౌన్, జనవరి 20 : భీమిలిలో ఈనెల 27వ తేదీన జరిగే ఉత్తరాంధ్ర కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హాజరుకానున్నారన్నారు. శనివారం రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. ప్రతి సచివాలయం నుంచి ఒక బస్సును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నక్కపల్లి, జనవరి 20: మండలంలోని ఎన్.నర్సాపురంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన తోట చ్రమ్మ కుటుంబానికి టీడీపీ గ్రామ నాయకులు రూ.10వేలు నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గణేశ్, వంగలపూడి శ్రీను, మనబాల కొండబాబు, గంగరాజు, అప్పారావు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

» జిల్లా జడ్జి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, జనవరి 20: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పదో అదనపు జిల్లా జడ్జి శ్రీవిద్య సూచించారు. శనివారం గవరపాలెం ఉన్నత పాఠశాలలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే మహిళలు పోక్సో చట్టంపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి. గంగరాజు, పి. ప్రదీప, బీవీ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, అనకాపల్లి డీఎస్పీ వి. సుబ్బరాజు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణ, తహసీల్దార్ గంగాధరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, లీగల్ సర్వీస్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దాడిని కలిసిన కశింకోట టీడీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 20: స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావును కశింకోట మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు కాయల మురళి ఆధ్వర్యంలో తేగాడ, చింతలపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, కన్నూరుపాలెం, తీడ, మోసయ్యపేట, చెరకాం, గోకివానిపాలెం, సుందరయ్యపేట, జి. భీమవరం, పరవాడపాలెం, జమాదులపాలెం గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్యనాయకులు దాడిని కలిశారు. ఈ సందర్భంగా కొంతసేపు వారితో మాజీ మంత్రి దాడి పలు విషయాల పై చర్చించారు.

శివాలయ పునర్నిర్మాణానికి టీడీపీ నేత విరాళం

సబ్బవరం, జనవరి 20 : మండల కేంద్రంలోని పురాతన శివాలయం పునర్నిర్మాణానికి తెలుగుయువత పెందుర్తి నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి రోమాల చంద్రశేఖర్ శనివారం రూ.1,44,999 విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బర్ల రమణ, ఉసిరికల రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీలు

కోటవురట్ల, జనవరి 20: ఉపాధి హామీ పనులను నిష్పక్షపాతంగా ఆడిట్ చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథం కోరారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో తూర్పుగోదావరి, విజయనగరం జిల్లాలకు చెందిన ఆడిట్ సిబ్బంది ఉపాధి పనులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.15 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో రూ.12 కోట్ల వేతనాలు. రూ.3 కోట్ల మెటీరియల్‌కు నిధులు ఖర్చు చేసినట్టు తెలిపారు. మండలంలో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు ఉపాధి హామీ పనుల తనిఖీకి సామాజిక బృందాలు పర్యటిస్తాయన్నారు.

నవోదయ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈవో

కశింకోట, జనవరి 20 : మండల కేంద్రంలో శనివారం నవోదయ ఎంట్రన్స్ పరీక్ష జరిగింది. డీపీఎన్ హైస్కూలు, బాలికల హైస్కూలు, సెయింట్ జాన్స్ స్కూళ్లలో 130 మంది పరీక్ష రాశారు. ఈ కేంద్రాలను డీఈవో వెంకటలక్ష్మి సందర్శించి, పరీక్ష విధానాన్ని పరిశీలించారు.

కోడిపందాలు నిర్వహించిన నలుగురికి జైలు

పరవాడ, జనవరి 20: కత్తులు కట్టి కోడిపందాలు నిర్వహించిన నలుగురికి అనకాపల్లి రెండో అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ విజయలక్ష్మి ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్టు పరవాడ సీఐ ఎస్. బాలసూర్యారావు తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో దేశపాత్రునిపాలెం పరిధిలోని సాయినగర్‌కాలనీలో వంగా మునిలినాయుడు, గంగవరపు రాజు, కోడూరు కుంచారావు, జాగవరపు శ్రీను కలిసి కోడిపుంజులకు కత్తులు కట్టి పందాలు నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారిని అరెస్టు చేసి, జడ్జి ఎదుట హాజరుపరచగా పై విధంగా తీర్పు చెప్పినట్టు సీఐ వెల్లడించారు. నలుగురిని అనకాపల్లి సబ్‌జైలుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి : సీఐ

పరవాడ, జనవరి 20 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పరవాడ సీఐ బాలసూర్యారావు సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రాంకీ కమర్షియల్ హబ్‌లో ఉద్యోగులకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఆయన ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం

» తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత

పాయకరావుపేట రూరల్, జనవరి 20 : రాష్ట్రంలో బీసీలకు టీడీపీ హయాంలోనే న్యాయం జరిగిందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. శనివారం మండలంలోని పాల్మన్‌పేటలో నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. సబ్సిడీపై పరికరాలను అందజేశామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందజేసి బీసీల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు టీడీపీ ఎంతో కృషి చేసిందన్నారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పింఛను, సబ్సిడీపై వలలు, బోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. నా బీసీలు, నా ఎస్సీలని చెబుతున్న వైఎస్.జగన్ వారికి చేసిందేమీలేదన్నారు. తన కోటరీలో ఒక్క బీసీ, ఎస్సీకి అవకాశం ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో అన్ని ముఖ్యమైన పదవుల్లో తన సామాజిక వర్గానికి చెందినవారినే జగన్‌రెడ్డి నియమించుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కలిసి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అంతకుముందు పాల్మన్‌పేటలో అనిత పల్లె పలకరింపు కార్యక్రమాన్ని చేపట్టారు. పాల్మన్‌పేట, రాజయ్యపేట, కొర్లయ్యపేట గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి టీడీపీ మినీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనిత

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల కృష్ణుడు, పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు లక్ష్మణరావు, టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, పెదిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, బొంది కాశీవిశ్వనాథం, పెదిరెడ్డి శ్రీను, పల్లా విలియం కేరి, పిర్ల కళ్యాణి, వంకా రమణ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రాస్తారోకో

అనకాపల్లి టౌన్, జనవరి 20 : అంగన్‌వాడీల సమ్మె శనివారానికి 40వ రోజుకి చేరుకుంది. వీరికి మద్దతుగా కార్మికసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద శిబిరం నుంచి ఎన్టీఆర్ జంక్షన్, నెహ్రూచౌక్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఔట్‌గేటు జంక్షన్‌లో నాయకులతోపాటు అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఏఐటీయూసీ నాయకుడు రాజాన దొరబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, నాయకులు గంటా శ్రీరామ్, ఆర్. అప్పలరాజు, వీవీ శ్రీనివాసరావు, కె.శంకరరావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. అంగన్‌వాడీల సమ్మెపై వైసీపీ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని, వారికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన శనివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ధర్నా శిబిరాన్ని వారు సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నేత ఎం.అప్పలరాజు, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మునగపాకలో.. న్యాయమైన తమ డిమాండ్లపై 40 రోజులుగా పోరాడుతున్నా స్పందించని ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా శనివారం అంగన్‌వాడీలు మెయిన్‌రోడ్‌పై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీవీ శ్రీనివాసరావు, బ్రహ్మాజీ, రైతు సంఘం నాయకులు ఆడారి మహేష్, లోవేశ్వరరావు, రామలక్ష్మి, అంజలి, తులసి, లక్ష్మి, ఉమ, సరస్వతి, ఆయాలు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ప్రతినిధి కర్రి అప్పారావు అన్నారు. ఎలమంచిలి లైనుకొత్తూరులో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరింది. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పరవాడలో.. అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె శనివారం నాటికి 40వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు 40వ సంఖ్య ఆకారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపాధ్యాయ సంఘం నాయకుడు కె. గంగాధర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం నిరసన శిబిరాన్ని సందర్శించి, తమ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంతో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

అచ్యుతాపురంలో.. న్యాయమైన కోర్కెలు సాధించిన వరకు పోరాటం కొనసాగిస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. శనివారం అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఖాళీపేట్లతో వారు నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 40 రోజు కొనసాగింది. తమ డిమాండ్లు పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగుతుందని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.



పరవాడలో 40వ సంఖ్య ఆకారంలో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు



అచ్యుతాపురంలో ఖాళీపేట్లతో ఆందోళన చేస్తున్న అంగన్ వాడీలు

పాములవాకలో ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

కోటవురట్ల, జనవరి 20: మండలంలోని పాములవాకలో గౌరీపరమేశ్వరుల తీర్థమహోత్సవాలు ఘనం గా జరిగాయి. శనివారం తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారికి భక్తుల సారెతో ఊరేగించారు. గ్రామపెద్దలు కిల్లాడ వెంకటేశ్వరసాయి, శ్రీనివాసరావు, వేచలపు జనార్దన్, భాస్కరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి.



పాములవాకలో అమ్మవారికి సారెను ఊరేగిస్తున్న భక్తులు

ఇండస్ట్రియల్ కారిడర్ రైతులకు పరిహారం చెల్లించండి

నక్కపల్లి, జనవరి 20: మండలంలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతుల్లో కొంతమందికి పరిహారం రాలేదని, వారందరికీ న్యాయం చేయాలంటూ రైతు సంఘ ప్రతినిధులు శనివారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో రైతు సంఘ నాయకుడు సూరకాసుల గోవింద్, కాగిత సర్పంచ్ పోతంశెట్టి రాజేశ్ తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కూలీ రైతుల సమైక్య వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

పాయకరావుపేట రూరల్, జనవరి 20 : మండలంలో కుమారపురం, రత్నయ్యపేట, రాజగోపాలపురం, కొర్లయ్యపేటల్లో మాదిగ, రజక, నాయీబ్రాహ్మణ, వాడబలిజ, శెట్టి బలిజ, విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాల కూలీ రైతుల సమైక్య వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటయ్యింది. అసోసియేషన్ అధ్యక్షుడుగా చేపల శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడిగా మోసా అప్పలరాజు, కార్యదర్శిగా దిగుమతి నాగేశ్వరరావు, కోశాధికారిగా అడ్డాల వరహాలరావు, సంయుక్త కార్యదర్శిగా మేడిశెట్టి శ్రీను ఎన్నికయ్యారు.

చంద్రబాబుకు బ్రహ్మరథం

... 5వ పేజీ తరువాయి

అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 40 వేల మంది వరకూ తరలివచ్చినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

వైసీపీ నుంచి భారీగా చేరికలు

అధికార వైసీపీకి చెందిన 16 మంది సర్పంచులు, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు...వేదికపై చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పార్టీ కండువాలు కప్పారు. పెదబయలు మండలం బొంగరం సర్పంచ్ లక్ష్మీపతి, పెదబయలు ఎంపీటీసీ సభ్యుడు కె.బొంజిబాబు, డుంబ్రిగుడ మండలం సాగర సర్పంచ్ కొర్రా తౌడమ్మ, గుంటగన్నెల సర్పంచ్ తాంగుల మోత్తి, అర్మా సర్పంచ్ కిల్లో మల్లేశ్, లైగండ సర్పంచ్ తామల శాంతి, కొర్రాయి సర్పంచ్ పూజారి కమల, అరకులోయ మండలం చినలబుడు సర్పంచ్ బురిడి ఉపేంద్ర, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బురిడి కొమ్ములు నాయుడు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈసారి అరకు పార్లమెంటు స్థానంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను గెలిపించి తీరాలని, వైసీపీని ఇంటికి పంపాలని చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు.

అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొర

... 5వ పేజీ తరువాయి

పనిచేసి వైసీపీని ఇంటికి పంపించి, దొన్నుదొరను గెలిపించుకోవాలన్నారు. వైసీపీ అరాచకాలను ప్రతి ఇంటికీ తెలిపాలని పార్టీ శ్రేణులకు బాబు సూచించారు. ఈ ప్రాంతం నుంచి పార్టీకి సేవలందించిన కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమ సేవలను గుర్తు చేస్తూ ఇద్దరు మంచి నాయకులను కోల్పోవడం దురదృష్టకరమని బాబు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వారి బిడ్డలైన శ్రావణ్‌కుమార్, అబ్రహంలకు సముచిత స్థానం కల్పిస్తామని, వారి గురించి తాను చూసుకుంటానని సభాముఖంగానే చంద్రబాబు వారికి భరోసా ఇచ్చారు. దీంతో కిడారి శ్రావణకుమార్, సివేరి అబ్రహంల అనుచరులు ఆనందం వ్యక్తం చేశారు.

పడకేసిన పనులు

... 5వ పేజీ తరువాయి

సాగుతున్నాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తేనే పనులు చేద్దామని కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.నియోజకవర్గంలో 61 సచివాలయాల భవనాలు మంజూరు కాగా మూడున్నర ఏళ్లలో 47 భవనాలను మాత్రమే పూర్తి చేశారు. 49 హెల్త్ క్లినిక్‌లకు 18 భవనాలు పూర్తి చేశారు. రైతు భరోసా కేంద్రాలు 59 మంజూరు కాగా, వాటిలో ఏడు పునాదుల స్థాయిలో ఉండడంతో వాటిని వదిలేసి, మిగిలిన 52 భవనాల పనులు చేపట్టగా 29 భవనాలు పూర్తి చేశారు. మిగిలిన భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని చోట్ల నిర్మాణాలు నిలిచిపోయి అసంపూర్తిగా మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి.

దుర్మార్గంగా జగన్ పాలన

... 5వ పేజీ తరువాయి

గురికాగా, 30 వేల మంది చనిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారం సీఎం చేస్తున్నారని ఆరోపించారు.గత ఎన్నికల్లో జగన్‌ను నమ్మి ఓటేస్తే ఆయన గిరిజనుల గొంతు కోశారని చంద్రబాబునాయుడు ఆరోపించారు. అధికారంలోకి వచ్చినప్పటి ఇప్పటివరకూ గిరిజనులకు జగన్ ఒక్క మంచి పని అయినా చేశారా?...అని ప్రశ్నించారు. అదేమంటే బటన్ నొక్కుతున్నాను కదా అంటారని, గిరిజనుల కోసం ఏ బటన్ నొక్కారని నిలదీశారు. జగన్ సీఎం అయిన తరువాత గిరిజనులకు చెందిన మొత్తం 16 పథకాలు రద్దు చేశారని ఆరోపించారు. ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఉండాలని 2003లో తాము జీవో-3 తీసుకువచ్చామన్నారు. గిరిబిడ్డలకు అన్యాయం చేసేలా దానిని జగన్ రద్దు చేశారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో-3 అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అన్ని రకాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. అరకు ప్రాంతంలో వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని, గిడ్డంగులు ఏర్పాటుచేసి ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంటు నెలకొల్పుతామని చెప్పారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే... వైసీపీ గంజాయిని ప్రమోట్ చేస్తోందని మండిపడ్డారు. విశాఖలో అల్లూరి సీతారామరాజు మ్యూజియం ఏర్పాటుకు నిర్ణయిస్తే దానిని మూలనపడేశారన్నారు. విశాఖలో రుషికొండకు బోడిగుండు చేసిన జగన్‌కు మరోసారి అధికారం ఇస్తే అరకు కొండలకు కూడా గుండు కొట్టిస్తారని హెచ్చరించారు. ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను తెలుగుదేశం వ్యతిరేకించిందని, వైసీపీ వచ్చిన తరువాత లేటరైట్ ముసుగులో బాక్సైట్ తవ్వుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఏజెన్సీలో లేటరైట్‌ను తవ్వి సీఎం సతీమణి భారతిరెడ్డికి చెందిన భారతి సిమెంట్ కంపెనీకి తరలిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల సంపద దోచుకుంటున్న జగన్ ఈ ప్రాంతానికి ఒక్క రోడ్డు కూడా వేయలేదని వ్యాఖ్యానించారు. చివరకు వైద్యం కోసం ఫీడర్ అంబులెన్స్‌లు పోయి డోలీ మోతలపై ఆధారపడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు.

జగన్ మోసాలకు బలికావొద్దు

కులం, మతం పేరుతో జగన్ చేస్తున్న మోసాలకు ఎవరు బలికావద్దన్నారు. మతం, కులం, ప్రాంతం తిండిపెట్టవని, సుపరిపాలన, అభివృద్ధి ఫలాలు అందిస్తే ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. తాను పెత్తందారునని జగన్ విమర్శిస్తుంటారని, అయితే దేశంలోనే అత్యంత ధనవంతుడైన సీఎంగా ఆయనకు రికార్డు ఉందన్నారు. పేదల పక్షపాతిగా చెప్పుకుంటున్న జగన్ వేల కోట్ల ఆస్తులు సంపాదనకు ఏ మంత్రం జపిస్తున్నారో...దానిని చెబితే గిరిజనులు ధనవంతుల వుతారని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కొత్త వేషంతో జగన్ వస్తారని పేర్కొంటూ ప్రజలంతా ఈవిషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

డొంకాడలో ఘనంగా శ్రీవారి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

నక్కపల్లి, జనవరి 20: మండలంలోని డొంకాడలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. ఉభయదేవేరులతో కూడిన ఉత్సవమూర్తులను అలంకరించి శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు జరిపించారు. సాయంత్రం మేళతాళాలతో స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది.

వెంకటాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ

మునగపాక, జనవరి 20 : మండలంలోని వెంకటాపురంలో శనివారం బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి కడియం అనురాధ ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు పొలమరశెట్టి మురళి, రేబాక మాలతి, బొడ్డేడ మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆడారి ఆనంద్ జన్మదిన వేడుకలు



ఆనంద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, ఆడారి వెంకట్, తదితరులు

ఎలమంచిలి, జనవరి 20: విశాఖ డెయిరీ చైర్మన్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, ఆనంద్ అనుచరుడు ఆడారి వెంకట్ తదితరులంతా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఎలమంచిలి నుంచి పెద్ద సంఖ్యలో ఆనంద్ అనుచరులు, అభిమానులు విశాఖకు తరలివెళ్లారు అందరి సమక్షంలో ఆనంద్ కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో యల్లపు సూరి అప్పారావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ములంపాక నానాజీ, మాజీ సర్పంచ్ బెజవాడ వెంకటరమణ, సుంకర గిరి, దాడి కిరణ్, దాడి నాయుడు, మళ్ల శ్రీను, బి.సురేష్, ఎస్.బాబూజీ పాల్గొన్నారు.

బాలిక సాధికారతకు సింహాద్రి ఎన్టీపీసీ కృషి

పరవాడ, జనవరి 20 : బాలిక సాధికారత కోసం సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం విశేష కృషి చేస్తుందని ఎన్టీపీసీ బిజినెస్ ఎక్సలెన్స్ మోడల్ (ఎన్‌బీఈఎం) బృందం ప్రతినిధులు ప్రశంసించారు. బాలిక సాధికారత మిషన్‌లో భాగంగా ఎంపికైన స్థానిక దీపాంజలినగర్ బాలభారతి పబ్లిక్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న 20 మంది బాలికలతో శనివారం ఎన్‌బీఈఎం ప్రతినిధులు హిమాన్స్ నౌటియల్, మనీష్ ఆనంద్ సమావేశమయ్యారు. విద్యార్థినులతో మాట్లాడి వారి అభిరుచులు, లక్ష్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారులు కె. ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐను కలిసిన టీడీపీ నేతలు

పరవాడ, జనవరి 20 : స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన ఎస్. బాలసూర్యారావును మండలానికి చెందిన టీడీపీ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇందల కొండలరావు, నగిరెడ్డి చిన్నారావు, కొత్తపల్లి బాబురావు, కరణం అప్పారావు, మజ్జి మాధవరావు, వి. శ్రీను పాల్గొన్నారు.

రెండో రోజూ పూడిమడక దళితుల ఆందోళన

అచ్యుతాపురం, జనవరి 20: పూడిమడకలో దళితుల ఆందోళన కొనసాగడంతో జెట్టీ రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయాయి. పూడిమడకలో జెట్టీకి ఉప్పుటేరులోంచి రోడ్డు నిర్మాణం వల్ల ఉప్పు పండించే 56 కుటుంబాల దళితులు ఉపాధి కోల్పోతున్నారని శుక్రవారం నుంచి ఆందోళన చేస్తున్నారు. అధికారుల్లో స్పందన లేకపోవడంతో శనివారం ఆందోళన కొనసాగించారు. దీంతో రోడ్డు పనులను కాంట్రాక్టర్ నిలిపివేశాడు. తమకు ప్రత్యామ్నాయ నీటి మార్గం ఏర్పాటు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని దళితులు తెలిపారు.కార్యక్రమంలో సమ్మింగా లక్ష్మణ, రేవిడి ఆనంద్, ఈరుగుల మహలక్ష్మి, సత్తాడ బాబూరావు పాల్గొన్నారు.

నేడు తాళ్లపాలెంలో సీతారాముల తీర్థం

కశింకోట, జనవరి 20 : మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో ఆదివారం సీతారాముల తీర్థం జరగనుంది. ఈ సందర్భంగా భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

నూకాంబిక ఆలయ పునర్నిర్మాణానికి నిధులివ్వండి

అనకాపల్లి టౌన్, జనవరి 20 : స్థానిక నూకాంబిక అమ్మవారి పునర్నిర్మాణానికి సీజీఎఫ్ నిధుల నుంచి రూ.3.31 కోట్లు మంజూరయ్యేలా చొరవ చూపాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కోరినట్టు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ శనివారం తెలిపారు. దక్షిణ రాజగోపురాన్ని రూ.కోటి 71 లక్షలతో అభివృద్ధి చేసేందుకు, క్యూ కాంప్లెక్స్ మండపాన్ని రూ.కోటి 60 లక్షలతో మరింత విస్తరించడానికి సీజీఎఫ్ నిధులు మంజూరయ్యేలా సిఫార్సు చేయాలని మంత్రిని కోరామన్నారు. తమ అభ్యర్థన మేరకు స్పందించిన మంత్రి అమర్‌నాథ్ సిఫార్సు చేశారన్నారు.

'మోదీతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం'

సబ్బవరం, జనవరి 20 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. మండలంలోని అంతకాపల్లిలో శనివారం సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో జరిగింది. ఈ సందరంగా రామునాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిధులతో రైతు సంక్షేమ కేంద్రాలు, జల్‌జీవన్ మిషన్‌తో ఇంటింటికీ కొళాయిలు, ఆహార భద్రత పథకం, తదితర ఎన్నో పథకాలు అమలు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కె.సన్యాసిరావు, గొంప నరసింగరావు, అధికారులు పాల్గొన్నారు.

వీజే పాలెంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర

ఎస్.రాయవరం, జనవరి 20: మండలంలోని వీజే పాలెంలో శనివారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి వైద్యాధికారిణి డాక్టర్ శక్తిప్రియ, వైద్య సిబ్బంది, టీడీపీ నేత వజ్రపు శంకరరావు, అధికారులు పాల్గొన్నారు.

వాహన డ్రైవర్లకు వైద్య పరీక్షలు

నక్కపల్లి, జనవరి 20: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద ప్రయాణికులు, వాహనచోదకుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాహన డ్రైవర్లకు హిమ నేత్ర సంరక్షణ కేంద్రం ద్వారా కంటి పరీక్షలు చేశారు. ఎన్‌హెచ్ఏఐ పీడీ సురేంద్రనాథ్, టోల్‌ప్లాజా మేనేజర్ భవన్నారాయణ, అధికారులు బాల సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఐఎంటీ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అది సొరంగం కాదు.. గుంతే...!

▸▸ పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫల్గుణరావు వెల్లడి

▸▸ కొమిరలో సొరంగం బయటపడిందన్న ప్రచారం నేపథ్యంలో పరిశీలన



సొరంగంగా చెపుతున్న ప్రదేశాన్ని పరిశీస్తున్న అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న ఏడీ

రావికమతం, జనవరి 20 : మండలంలోని కొమిర గ్రామంలో వారం రోజుల క్రితం తవ్వకాలు జరుపుతుండగా సొరంగం బయటపడిందన్న ప్రచారం నేపథ్యంతో విశాఖ నుంచి పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫల్గుణరావు, సిబ్బంది శనివారం విచ్చేసి సందర్శించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావుతో కలిసి ఆ ప్రాంతానికి ఆయన చేరుకున్నారు. సొరంగంగా చెపుతున్నచోట దిగేందుకు పొడవైన నిచ్చెన, తాడు తదితర పరికరాలను సిద్ధం చేశారు. 108 వాహనాన్ని కూడా అందుబాటులో ఉంచారు. అయితే తొలుత అందులో దిగేందుకు ఏడీ కాస్త భయపడ్డారు. దీంతో గ్రామానికి చెందిన యువకుడు అప్పికొండ అర్జున, ఎస్ఐలు టార్చిలైట్‌తో దిగడంతో ఏడీ కూడా వారితో దిగారు. లోపల పది అడుగుల వరకూ దిగి పరిశీలించారు. అక్కడి నుంచి మనిషి లోపలికి వెళ్లలేనంత ఇరుగ్గా ఉండడంతో లోపల సొరంగం వంటిది ఏమీ లేదని గుర్తించారు. ఇది సొరంగం కాదని దీనిని ఆనుకొని ఉన్న కొండ నుంచి నీరుపారే గుంత కావచ్చునని ఏడీ అభిప్రాయపడ్డారు. ఈ గోయ్యిని పూర్తిగా పూడ్చివేయాలని తహసీల్దార్, ఎస్ఐలు సర్పంచ్ గొర్లె రవికుమార్‌కు సూచించారు. ఇదిలావుంటే, సొరంగం బయటపడిందన్న ప్రచారం జరిగిన వారం రోజుల తరువాత పురావస్తు శాఖ అధికారులు వచ్చి తూ.తూ.మంత్రంగా పరిశీలించారని పలువురు గ్రామస్థులు ఆరోపించారు.

'జగన్ ఓటమే యువత లక్ష్యం కావాలి'



పప్పుశెట్టిపాలెం సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల రాజేశ్

గొలుగొండ, జనవరి 20 : ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న జగన్‌ను యువత తలచుకుంటే గద్దెదించడం కష్టం కాదని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు, మునిసిపల్ కౌన్సిలర్ చింకాయల రాజేశ్ అన్నారు. పప్పుశెట్టిపాలెంలో శనివారం ఏర్పాటైన యువత ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఏ గ్రామంలో చూసినా టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధే తప్ప, వైసీపీ పాలనలో చేసింది శూన్యమని ఆరోపించారు. ఓటర్లంతా ఓటు హక్కును వినియోగించుకునేలా యువత చూడాలని పిలుపునిచ్చారు. నాయకులు చిటికెల సాంబమూర్తి, చీడిగుమ్మల సొసైటీ మాజీ అధ్యక్షుడు భీమిరెడ్డి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, ఆదపురెడ్డి గోపి, గెడ్డం నానాజీ, ఆనంద్, దట్టం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

54 కిలోల గంజాయితో నలుగురు అరెస్టు



పట్టుబడిన గంజాయిని చూపుతున్న సీఐ,ఎస్ఐ

రోలుగుంట, జనవరి 20 : వ్యాన్‌లో తరలిస్తున్న గంజాయిని రోలుగుంట పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలివి. మండలంలోని రాజన్నపేట వద్ద శనివారం ఉదయం వాహన తని ఖీలు చేపట్టామన్నారు. ఇంతలో ఇటుగా ఓ వ్యాను వస్తుండగా ఆపామన్నారు. తమను చూసి నలుగురు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. అనంతరం వ్యాన్‌ను పరిశీలించిగా, ప్రత్యేకంగా తయారు చేసిన అరలో 54 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. దీంతో నిజామాబాద్‌కు చెందిన మొహమ్మద్ నయిముద్దీన్, పసుల సుకుమార్, అల్లూరి జిల్లాకు చెందిన కొర్రా సుబ్బారావు, వంతల సింహాద్రిలను అరెస్టు చేసినట్టు చెప్పారు.

అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొర

... 5వ పేజీ తరువాయి

పనిచేసి వైసీపీని ఇంటికి పంపించి, దొన్నుదొరను గెలిపించుకోవాలన్నారు. వైసీపీ అరాచకాలను ప్రతి ఇంటికీ తెలిపాలని పార్టీ శ్రేణులకు బాబు సూచించారు. ఈ ప్రాంతం నుంచి పార్టీకి సేవలందించిన కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమ సేవలను గుర్తు చేస్తూ ఇద్దరు మంచి నాయకులను కోల్పోవడం దురదృష్టకరమని బాబు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వారి బిడ్డలైన శ్రావణ్‌కుమార్, అబ్రహంలకు సముచిత స్థానం కల్పిస్తామని, వారి గురించి తాను చూసుకుంటానని సభాముఖంగానే చంద్రబాబు వారికి భరోసా ఇచ్చారు. దీంతో కిడారి శ్రావణకుమార్, సివేరి అబ్రహంల అనుచరులు ఆనందం వ్యక్తం చేశారు.

దుర్మార్గంగా జగన్ పాలన

... 5వ పేజీ తరువాయి

గురికాగా, 30 వేల మంది చనిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారం సీఎం చేస్తున్నారని ఆరోపించారు.

గత ఎన్నికల్లో జగన్‌ను నమ్మి ఓటేస్తే ఆయన గిరిజనుల గొంతు కోశారని చంద్రబాబునాయుడు ఆరోపించారు. అధికారంలోకి వచ్చినప్పటి ఇప్పటివరకూ గిరిజనులకు జగన్ ఒక్క మంచి పని అయినా చేశారా...అని ప్రశ్నించారు. ఆదేమంటే బటన్ నొక్కుతున్నాను కదా అంటారని, గిరిజనుల కోసం ఏ బటన్ నొక్కారని నిలదీశారు. జగన్ సీఎం అయిన తరువాత గిరిజనులకు చెందిన మొత్తం 16 పథకాలు రద్దు చేశారని ఆరోపించారు. ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఉండాలని 2003లో తాము జీవో-3 తీసుకువచ్చామన్నారు. గిరిబిడ్డలకు అన్యాయం చేసేలా దానిని జగన్ రద్దు చేశారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో-3 అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అన్ని రకాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. అరకు ప్రాంతంలో వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని, గిడ్డంగులు ఏర్పాటుచేసి ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంటు నెలకొల్పుతామని చెప్పారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే...వైసీపీ గంజాయిని ప్రమోట్ చేస్తోందని మండిపడ్డారు. విశాఖలో అల్లూరి సీతారామరాజు మ్యూజియం ఏర్పాటుకు నిర్ణయిస్తే దానిని మూలనపడేశారన్నారు. విశాఖలో రుషికొండకు బోడిగుండు చేసిన జగన్‌కు మరోసారి అధికారం ఇస్తే అరకు కొండలకు కూడా గుండు కొట్టిస్తారని హెచ్చరించారు. ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను తెలుగుదేశం వ్యతిరేకించిందని, వైసీపీ వచ్చిన తరువాత లేటరైట్ ముసుగులో బాక్సైట్ తవ్వుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఏజెన్సీలో లేటరైట్‌ను తవ్వి సీఎం సతీమణి భారతిరెడ్డికి చెందిన భారతి సిమెంట్ కంపెనీకి తరలిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల సంపద దోచుకుంటున్న జగన్ ఈ ప్రాంతానికి ఒక్క రోడ్డు కూడా వేయలేదని వ్యాఖ్యానించారు. చివరకు వైద్యం కోసం ఫీడర్ అంబులెన్స్‌లు పోయి డోలీ మోతలపై ఆధారపడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు.

జగన్ మోసాలకు బలికావొద్దు

కులం, మతం పేరుతో జగన్ చేస్తున్న మోసాలకు ఎవరు బలికావద్దన్నారు. మతం, కులం, ప్రాంతం తిండిపెట్టవని, సుపరిపాలన, అభివృద్ధి ఫలాలు అందిస్తే ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. తాను పెత్తందారునని జగన్ విమర్శిస్తుంటారని, అయితే దేశంలోనే అత్యంత ధనవంతుడైన సీఎంగా ఆయనకు రికార్డు ఉందన్నారు. పేదల పక్షపాతిగా చెప్పుకుంటున్న జగన్ వేల కోట్ల ఆస్తులు సంపాదనకు ఏ మంత్రం జపిస్తున్నారో...దానిని చెబితే గిరిజనులు ధనవంతులవుతారని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కొత్త వేషంతో జగన్ వస్తారని పేర్కొంటూ ప్రజలంతా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

అద్దె గూడు.. సమస్యలపై గోడు..!

▸▸ అసౌకర్యాల నడుమ వమ్మలి సచివాలయ సిబ్బంది విధులు

▸▸ వివిధ పనులపై వచ్చే ప్రజలకూ తప్పని ఇబ్బందులు

▸▸ నూతన భవనం నిర్మించినా ప్రారంభానికి నోచుకోని వైనం

▸▸ చిన్నచిన్న పనులు పెండింగ్ ఉన్నాయని కాలయాపన



గ్రామంలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న సచివాలయం



ప్రస్తుతం సిబ్బంది విధులు నిర్వహిస్తున్న ఇరుకు గది



వృథాగా ఉన్న లక్షలు వెచ్చించి నిర్మించిన పక్కా భవనం

మాడుగుల రూరల్, జనవరి 20 : కొందరు అధికారుల అలక్ష్యం సర్కారుపై భారంగా మారుతోంది. సొంత భవనాలు లేని కార్యాలయాలు, విద్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడం పరిపాటి. కానీ లక్షలాది రూపాయలు వెచ్చించి, అందమైన భవనాలు నిర్మించి కూడా అందులోకి వాటిని మార్పు చేయపోవడం చూస్తుంటే.. సదరు అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతోంది. ఇందుకు ఉదాహరణంగా మాడుగుల మండలంలోని వమ్మలి గ్రామ సచివాలయ భవనాన్నే చెప్పవచ్చు. ఏళ్లతరబడి ఈ కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. నెలకు ఆరువేల రూపాయలు అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. చిన్నపాటి రెండు గదులు, చిన్న వరండా మాత్రమే ఉన్నాయి. ఇలాంటి చాలీచాలని ఇరుకు గదుల్లో ఇబ్బందుల నడుమ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వివిధ పనులపై వచ్చే ప్రజలకు కూడా అవస్థలు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో కుర్చీలు కూడా వేయలేని దుస్థితి ప్రస్తుతం నెలకొంది. కనీసం సచివాలయ సిబ్బంది ప్రజలతో సమావేశం నిర్వహించాలన్నా భవనం బయట ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఉన్నతాధికారులు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 40లక్షలతో గ్రామ సచివాలయానికి కొత్త భవనాన్ని నిర్మించారు. కానీ ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నిస్తే.. చిన్నచిన్న పనులు ఉన్నాయని చెప్పుకొస్తూ కాలయాపన చేస్తున్నారు. వాస్తవానికి భవనం పనులు పూర్తయ్యాయి. ఎవరో వస్తారు.. ఎప్పుడో ప్రారంభిస్తారు.. అని ఎదురు చూపులు చూస్తున్నారే తప్ప, సొంత భవనంలోకి వెళితే అద్దె డబ్బులు ప్రభుత్వానికి మిగిలుతాయన్న కనీస ఆలోచన చేయలేకపోతున్నారు. ఫలితం సదరు కొత్త భవనం నిరుపయోగంగా మారడంతో పాటు చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. అయినప్పటికీ వృథాగా ఉన్న సచివాలయ భవనాన్ని అందుబాటులోకి తేవాలన్న ఆలోచనను ఇటు అధికారులుగానీ, అటు ప్రజాప్రతినిధులుగానీ చేయకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాల్సిందిగా కోరుతున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల రాస్తారోకో



నర్సీపట్నం అబీద్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నర్సీపట్నం, జనవరి 20 : డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె శనివారం 40వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు పట్టణంలోని అబీద్ సెంటర్‌లో రాస్తారోకో జరిపారు. వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈశ్వరరావు, ఐద్వా ప్రతినిధులు సూర్యప్రభ, ఎల్.గౌరీ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : డిమాండ్లు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు శనివారం ఇక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు లీడర్ ఎస్.సత్యవేణి మాట్లాడుతూ తమ ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. రానున్న ఎన్నికల్లో అంగన్‌వాడీల తడఖా చూపుతామని వారంతా స్పష్టం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌వో సర్టిఫికేట్ అందుకుంటున్న ప్రిన్సిపాల్

నర్సీపట్నం, జనవరి 20 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు లభించింది. సదరు ప్రతినిధులు తొలుత కళాశాలలో పర్యటించి విద్యాబోధన, డిజిటల్ తరగతి గదులు, ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ, జిమ్, విశాలమైన మైదానం తదితర సౌకర్యాలను పరిశీలించిన అనంతరం గుర్తింపు పత్రాన్ని అందజేసినట్టు ప్రిన్సిపాల్ ఎస్.రాజు తెలిపారు. గతంలో నాక్ బృందం పర్యటించి బి-గ్రేడ్ సర్టిఫికెట్ ఇవ్వగా, ఇప్పుడు ఐఎస్‌వో గుర్తింపు పత్రం అందుకోవడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి కూలీ కుటుంబానికి పరిహారం పంపిణీ

మాకవరపాలెం, జనవరి 20 : ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ మృతిచెందిన కూలీ కుటుంబానికి మంజూరైన రూ.50 వేల పరిహారం చెక్కును అతని భార్యకు ఎంపీపీ సత్యనారాయణ శనివారం ఇక్కడ అందజేశారు. బూరుగుపాలేనికి చెందిన కొమ్మనాపల్లి కన్నబాబు ఉపాధి పనుల్లో ఉండగా, గత ఏడాది మే 16వ తేదీన చెరువు గట్టుపై ఉన్న విద్యుత్ వైర్లకు తన చేతిలోని గునపాం తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఆ పథకం ద్వారా మంజూరైన పరిహారాన్ని ఎంపీపీ అందించారు.

నేడు తారువలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

దేవరాపల్లి, జనవరి 20 : మండలంలోని తారువ గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఆదివారం ప్రారంభం కానుంది. ఇది అందుబాటులోకి వస్తే పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ట్రాన్స్‌కో ఏఈఈ కె.శంకరరావు తెలిపారు.

వేములపూడి మాజీ సర్పంచ్ చెల్లయ్యమ్మ మృతి



నర్సీపట్నం, జనవరి 20 : వేములపూడి మాజీ సర్పంచ్ బోళెం చెల్లయ్యమ్మ (81) శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాపకు ఈమె స్వయాన అత్త. శనివారం ఎమ్మెల్యే గణేశ్, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, రుత్తల ఎర్రాపాత్రుడు, డాక్టర్ రాజశేఖర్ నివాళులర్పించారు.

అసైన్డ్ భూములపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ తహసీల్దార్లకు ఆర్డీవో జయరాం సూచన



తహసీల్దార్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం అర్బన్, జనవరి 20: అసైన్డ్ భూముల విషయంలో తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో జయరాం సూచించారు. ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం డివిజన్‌లోని వివిధ మండలాల తహసీల్దార్లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, తదనుగుణంగా క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు సిబ్బందితో సమగ్ర విచారణ చేపట్టి నివేదికలు తయారు చేయాలన్నారు. 20ఏళ్లు పూర్తయిన అసైన్డ్ భూములపై హక్కులు కల్పించే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం అసైన్డ్ భూములు, చుక్కల భూములు, ఇనాం భూములు, ఎల్‌పీఎంల విభజన తదితరాలపై చర్చించారు. స్పందనలో వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరులకు మహిళల పూజలు

గొలుగొండ, జనవరి 20 : చిన్నయ్యపాలెంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆది దంపతులకు విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేళతాళాలు బాజా భజంత్రీల నడుమ గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. సర్పంచ్ రాజేశ్వరి, చిటికెల రాజీవ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'ఉత్తమ వ్యవసాయ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు'



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

కె.కోటపాడు, జనవరి 20 : ఉత్తమ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహనరావు సూచించారు. మండలంలోని వారాడ గ్రామంలో శనివారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలసాగుపై రైతులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చిరంజీవి, విజేత తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు వలంటీర్లను ఎందుకు ఎంపిక చేశారు?

▸▸ ఎంపీడీవోను ప్రశ్నించిన వజ్రగడ క్రీడాకారులు ▸▸ బాధ్యులపై చర్యలకు డిమాండ్



ఎంపీడీవోతో మాట్లాడుతున్న క్రీడాకారులు

మాకవరపాలెం, జనవరి 20 : ఆడుదాం ఆంధ్ర పోటీలకు వలంటీర్లను ఎందుకు ఎంపిక చేశారంటూ మండలంలోని వజ్రగడ క్రీడాకారులు శనివారం ఎంపీడీవో సీతామహాలక్ష్మిని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా శుక్రవారం గిడుతూరులో మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. వజ్రగడ గ్రామానికి చెందిన క్రీడాకారులు, మాకవరపాలెం గ్రామానికి చెందిన క్రీడీకారుల మధ్య జరిగిన ఫైనల్స్‌లో మాకవరపాలెం క్రీడాకారులు విజయం సాధించారు. అయితే మాకవరపాలెం క్రీడాకారుల్లో వలంటీర్లను ఆడించి తమను ఓడించారని, అసలు వలంటీర్లను ఎందుకు ఎంపిక చేశారని వారంతా ఎంపీడీవోను నిలదీశారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో పాటు వీరిని ఎంపిక చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

గామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : బూడి



వృద్ధురాలికి పథకాల గురించి వివరిస్తున్న బూడి

చీడికాడ, జనవరి 20 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తెలిపారు. అప్పలరాజుపురంలో శనివారం సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సబ్‌సెంటర్ భవనాలతో పాటు వైఎస్సార్ విగ్రహాన్ని, పలు గ్రామాలకు వేసిన రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, తహసీల్దార్ బీవీ రాణి, ఎంపీడీవో జయప్రకాశరావు, సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, వైసీపీ నాయకులు గొల్లవిల్లి రాజుబాబు, స్వామినాయుడు, కురచా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో పూర్వ విద్యార్థుల సందడి



అల్లూరి పార్కులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కృష్ణాదేవిపేట, జనవరి 20 : ఏఎల్‌పురం హైస్కూల్ పూర్వ విద్యార్థులు శనివారం ఇక్కడ సందడి చేశారు. 1973 నుంచి 1976 విద్యా సంవత్సరం వరకు చదువుకున్నవారంతా కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా స్థిరపడినవారు దాదాపు యాభై వసంతాల తరువాత ఓచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేవు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా పోతల శ్రీరామమూర్తి, కార్యదర్శిగా చైతన్యబాబు, సభ్యులుగా ఎల్‌వీ రమణ, వబ్బలరెడ్డి శ్రీనివాసరావు, దలే వీరభద్రుడు, ఎం.రాంబాబు, పీవీ రమణ, రేముల నాగేశ్వరరావులతో పాటు మరికొందరిని ఎన్నుకున్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణను అడ్డుకోవాలని జనసేన ఆందోళన



ఆర్టీసీ స్థలం వద్ద ఆందోళన చేస్తున్న పార్టీ శ్రేణులు

చోడవరం, జనవరి 20 : పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు, దేవదాయ శాఖ స్థలాల అన్యాక్రాంతాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ జనసేన నాయకుడు జెర్రిపోతుల నానాజీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు శనివారం ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన నిర్వహించారు. కాంప్లెక్స్ వద్ద స్థలం లీజుపేరుతో పక్కనే ఉన్న పంచాయతీ, దేవదాయ శాఖ స్థలాలు అధికార పార్టీనేతలు ఆక్రమించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సిందిగా కోరారు. పార్టీ నాయకులు మందపాక బాబూరావు, పసుపులేటి గోవింద, గొలగాని సత్య అప్పారావు, దండుపాటి తాతారావు, నరమండ శివ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బ్రహ్మరథం

... 5వ పేజీ తరువాయి

అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 40 వేల మంది వరకూ తరలివచ్చినట్టు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

వైసీపీ నుంచి భారీగా చేరికలు

అధికార వైసీపీకి చెందిన 16 మంది సర్పంచులు, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు ...వేదికపై చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పార్టీ కండువాలు కప్పారు. పెదబయలు మండలం బొంగరం సర్పంచ్ లక్ష్మీపతి, పెదబయలు ఎంపీటీసీ సభ్యుడు కె.బొంజిబాబు, డుంబ్రిగుడ మండలం సాగర సర్పంచ్ కొర్రా తౌడమ్మ, గుంటగన్నెల సర్పంచ్ తాంగుల మోత్తి, అర్మా సర్పంచ్ కిల్లో మల్లేశ్, లైగండ సర్పంచ్ తామల శాంతి, కొర్రాయి సర్పంచ్ పూజారి కమల, అరకులోయ మండలం చినలబుడు సర్పంచ్ బురిడి ఉపేంద్ర, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బురిడి కొమ్ములునాయుడు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈసారి అరకు పార్లమెంటు స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను గెలిపించి తీరాలని, వైసీపీని ఇంటికి పంపాలని ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు

దేవరాపల్లి/రావికమతం, జనవరి 20 : ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నవోదయ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. దేవరాపల్లి పాఠశాలలో 147 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు ఎంఈవో బి.పడాల్‌దాస్ తెలిపారు. అలాగే, రావికమతం జడ్పీ పాఠశాలలో జరిగిన పరీక్షకు 202 మంది విచ్చేసినట్టు హెచ్ఎం మల్లికార్జునరావు వివరించారు.

ఘనంగా రాములవారి తీర్థం

కృష్ణాదేవిపేట, జనవరి 20 : మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో రాములవారి తీర్థాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిపారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పడకేసిన పనులు

... 5వ పేజీ తరువాయి

సాగుతున్నాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తేనే పనులు చేద్దామని కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.

నత్తనడకన పనులు

నియోజకవర్గంలో 61 సచివాలయాల భవనాలు మంజూరు కాగా మూడున్నర ఏళ్లలో 47 భవనాలను మాత్రమే పూర్తి చేశారు. 49 హెల్త్ క్లినిక్‌లకు 18 భవనాలు పూర్తి చేశారు. రైతు భరోసా కేంద్రాలు 59 మంజూరు కాగా, వాటిలో ఏడు పునాదుల స్థాయిలో ఉండడంతో వాటిని వదిలేసి, మిగిలిన 52 భవనాల పనులు చేపట్టగా 29 భవనాలు పూర్తి చేశారు. మిగిలిన భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని చోట్ల నిర్మాణాలు నిలిచిపోయి అసంపూర్తిగా మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి.